ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
ఆదివారం 8 డిసెంబరు 2024

పల్లెల ప్రగతికి పెద్దపీట

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్లెలను అన్ని రంగాల్లో ముందుం చాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతికి అధిక నిధులు కేటాయించి పెద్దపీట వేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు, మహిళా సంఘం భవనం ప్రహరీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో ముందుకు సాగుతోందన్నారు.

న్యూస్ బాక్స్

17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా గంగారాం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా టి.గంగారాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పని చేసిన శ్రీనివాసరావు 3వ బెటాలియన్‌కు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తున్న గంగారాం బాధ్యతలు చేపట్టారు.

విద్యుత్ ప్రజావాణి

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సెస్ సెక్షన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కస్తూర్బాలో నీటి కష్టాలు

వీర్నపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బోరు మోటారు కాలిపోవడంతో విద్యార్థులకు నాలుగు రోజులుగా నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామపంచాయతీ ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసినా సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. బోరు మోటారు మరమ్మతు చేయించకపోవడంపై విద్యార్థుల తల్లి దండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

యాసంగికి సన్నద్ధం



- జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు
- వరి నాట్లకు ఏర్పాట్లు
- సమృద్ధిగా భూగర్భ జలాలు
- ప్రాజెక్ట్‌లు, చెరువులకు జలకళ
- యాసంగి పంటలకు భరోసా
- చివరి దశకు వానాకాలం ధాన్యం కొనుగోళ్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం అయ్యారు. జిల్లాలో వానాకాలం పంట దిగుబడి ధాన్యం అమ్మకాలు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో రైతులు యాసంగి వరినాట్లకు నారుమడులకు ఏర్పాట్లు చేసుకున్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ యాసంగి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఇందులో ప్రధా నంగా వరి 1.74లక్షల ఎకరాల్లో వేయనున్నారు. మొక్క జొన్న 1431 ఎకరాలు, నువ్వులు 362, పొద్దు తిరుగుడు 810, శెనగలు 178, ఇతర పంటలు 317 ఎకరాలు సాగు చేయనున్నారు. ఇందుకోసం 18,500 క్వింటాళ్ల వరి విత్తనాలు, 115 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు, 6 క్వింటాళ్ల నువ్వులు, 18 క్వింటాళ్ల శెనగలు, ఇతర పంటలకు సంబంధించి 10 క్వింటాళ్ల విత్తనాలను సమకూరుస్తున్నారు. యాసంగి సాగుకు సంబంధించి 42,733 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. ఇందులో యూరియా 21,811 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3359 మెట్రిక్ టన్నులు, ఎంఓపీకేఎస్ 11516 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 4607 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1440 మెట్రిక్ టన్నులు సిద్ధం చేస్తున్నారు. రైతులు ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన వారు నారుమడులు వేసుకొని నాట్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో యాసంగి సందడి మొదలైంది.

సాగునీటికి ఢోకా లేదు

వానాకాలం సాగు ప్రారంభంలో వర్షాలు ఇబ్బంది పెట్టినా ఆ తరువాత కురిసిన వర్షాలతో జిల్లాలో శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, ఎగువ మానేరు, నిమ్మపల్లి ప్రాజెక్ట్‌లతోపాటు చెరువులు నీటి కళను సంతరించుకున్నాయి. దీంతో యాసంగి సాగుకు ఢోకా ఉండదని రైతులు భరోసాతో ఉన్నారు. యాసంగిలో ప్రధానంగా 1.74 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు. వరికి నీటి వసతి ప్రధానం కావడంతో చెరువులు, కుంటలతోపాటు బోరు బావుల్లోనూ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 830.0 సాధారణ వర్షపాతానికి 977.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 945 మిల్లీమీటర్లు, చందుర్తి 1237, వేములవాడ రూరల్ 870, బోయినపల్లి 910,

మిగతా 6వ పేజీలో



టీబీపై అప్రమత్తంగా ఉండాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీబీపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు అన్నారు. శనివారం తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీబీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజగోపాల్, పీహెచ్‌సీ వైద్యాధికారి స్నేహ పాల్గొన్నారు.

యారన్ డిపో ఏర్పాటు హర్షనీయం


సిరిసిల్లలో ఆది శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో యారన్ డిపో ఏర్పాటు హర్షనీయమని సిరిసిల్ల కుటీర పరిశ్రమల వస్త్ర ఉత్పత్తి దారుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లలో కుటీర వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. నాయకులు గౌడ వాసు, కొండ ప్రతాప్, గుండెల్లి రమేష్, గాజుల శంకర్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో మా సమస్యలు మాట్లాడండి


కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై మాట్లాడాలని మాజీ సర్పంచులు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, బిల్లులు విడుదల చేసే విధంగా చూడాలని కోరారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు, ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే జూల్‌ఫేకర్ అలీకి కూడా విజ్ఞప్తి చేశారు. సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, చాకలి రమేస్, బొజ్జ మల్లేశం, గంగాధర్, మల్యాల దేవయ్య గున్నాల లక్ష్మణ్, కోల నర్సయ్య, మహేందర్, సుమతి, ఎల్లం ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

- జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్

నేతన్నచౌక్ వద్ద కార్మికుల ధర్నా


6 సిరిసిల్లలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు, నాయకులు

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోం

- బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు
- కోడెల తరలింపుపై ధర్నా


4 ఈవో కార్యాలయంలో బైఠాయించిన బీజేపీ నాయకులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన 'డ్రైవర్ స్లీప్ అలర్ట్ సిస్టమ్'


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, డిసెం బరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి తయారు చేసిన డ్రైవర్ స్లీప్ అలర్ట్ సిస్టమ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. వేములవాడలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ట్రాన్స్ పోర్ట్ కమ్యూనికేషన్ విభాగంలో శ్రీమాన్‌గౌడ్ ఎగ్జిబిట్ ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం విద్యార్థి బూమెల్ల శ్రీమాన్‌గౌడ్, సైన్స్ గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

నంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ముస్తాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు నంబరు ప్లేట్లు లేకున్నా, మార్ఫింగ్ చేసినా చర్యలు తప్పవని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. శనివారం ముస్తాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సై గణేశ్ వాహనాల తనిఖీ చేశారు. నంబరు ప్లేట్ తొలగించిన వాహనదారుడిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పీసీ సుకుమార్, దామోదర్, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు భాష పరిరక్షణ సమితి కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఎంఈవో కృష్ణహరి, ఫౌండేషన్ నిర్వాహకులు రమకుమారి, జ్యోతిరాణి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.

నేతన్నల అభ్యున్నతికి చర్యలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

సిరిసిల్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేతన్నల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో చేనేత జౌళి శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించి నివేదికలను వివరించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి టెక్స్‌టైల్ పార్కులో జూకి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, టెక్స్‌పోర్టు కంపెనీలో ఉద్యోగాలు సాధించిన మహిళలకు నియామక పత్రాలు, లబ్ధిదారులకు నేతన్న బీమా చెక్కులు, పది శాతం యారన్ సబ్సిడీకి సంబంధించిరూ 37.49 కోట్లు, సంవత్సరాల కాలంగా మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లకు రావాల్సిన రూ.379.85 కోట్ల విలువ చేసే చెక్కులను అందించారు. నేత కార్మికులను సన్మానించారు. వివిధ పోటీల్లో విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాదిగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం, అభివృద్ధి సమకాలీకంగా భావిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగించారన్నారు. జిల్లాలో రూ.700 కోట్ల పైచిలుకు పనులకు ముఖ్యమంత్రి ఇటీవల శంకుస్థాపన చేశారన్నారు. జిల్లాకు దాదాపు రూ.వెయ్యి కోట్లు ముఖ్యమంత్రి కేటాయించారని గుర్తు చేశారు. సిరిసిల్లకు సాగునీరు అందించే ప్యాకేజీ 9 పనులు చొప్పదండికి సంబంధించి శ్రీపాద ఎల్లంపల్లి పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించామన్నారు. ఏడాది కాలంలో నేతన్నలకు దాదాపు రూ.370 కోట్లు అందించామన్నారు. టెస్కో ద్వారా గోదాంల ఆధునికీకరణతోపాటు మరమగ్గాలకు త్రిఫ్ట్ నిధుల కింద రూ.36.44 కోట్లు సబ్సిడీ, నేతన్న బీమా కింద రూ.2.15 కోట్లు విడుదల చేశామన్నారు. యారన్ సబ్సిడీ కింద రూ.6.32 కోట్లు అందించి నేతన్నలకు అండగా నిలిచామన్నారు. వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు డిపోల ద్వారా నేతన్నలకు నూలు అందించడమే కాకుండా భవిష్యత్‌లో నూలు డిపోను రూ .వంద కోట్లకు విస్తరిస్తామన్నారు. మహిళ సంఘాల్లోని సభ్యులకు రెండు చీరలు అందించే ఆర్డర్లను నేతన్నలకు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం అవలంబించిన ఆర్థిక విధానాల ద్వారా రాష్ట్రం చాలా నష్టపోయిందని, ఆర్థిక వ్యవస్థ బాగుచేస్తూ గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. ఒకటే రోజు అద్భుతాలు సాధ్యం కావని, భవిష్యత్‌లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నెరవేరుస్తామని అన్నారు. ప్రభుత్వం ఐటీఐ కేంద్రాలను రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తోందన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం పనిచేస్తుంటే ప్రతిపక్షాలు వాట్సప్ యూనివర్సిటీ ద్వారా అబద్దాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూపరెడ్డి, టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు, ఏడీ సాగర్ సిరిసిల్ల వస్త్ర పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

జంట నగరాలుగా అభివృద్ధి చేస్తాం

వేములవాడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వేములవాడ, సిరిసిల్లలను జంట నగరాల్లగా అబివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శనివారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాతో కలిసి నేతన్నలకు యారన్‌ను పంపిణీ

మిగతా 6వ పేజీలో..

జిల్లాలో వర్షం


వేములవాడ పాత ఆంధ్రాబ్యాంక్ ఎదుట వరద నీరు

సిరిసిల్ల/వేములవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం పలు చోట్ల వర్షం కురిసింది. సిరిసిల్ల, వేములవాడ, రుద్రంగి, కోనరావుపేట, వీర్నపల్లి, చందుర్తి, తంగళ్లపల్లి ప్రాంతాల్లో వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా చూసుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం వరకు జిల్లాలో 13.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మరోసారి రాజన్న కోడెల వివాదం

- గీసుకొండలో దొరికిన కోడెలు ఎక్కడివి?
- రైతుల పేరుతో మంత్రి అనుచరుడు తీసుకువెళ్లినట్లు ఆరోపణలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన మంత్రి సిఫారసు లేఖ

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కోడెల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వేములవాడ రాజన్నకు కోడెమొక్కు ప్రధానంగా భావిస్తారు. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన భక్తులు మొక్కుల చెల్లింపులో భాగంగా కోడెలను తీసుకొచ్చి ఆలయంలో అప్పగిస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైతులు కూడా పాడిపంటలు బాగుంటే రాజన్నకు కోడెను సమర్పించుకుంటారు. అయితే వరంగల్ జిల్లా గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో రాంబాబు అనే వ్యక్తి రాజన్న కోడెలను తరలిస్తూ గత నెల 28న స్థానికుల కంటపడ్డాడు. దీంతో అనుమానం వచ్చిన కొందరు యువకులు రాంబాబుపై పోలీస్ స్టేషన్‌లో గత నెల 29వ తేదీన ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులకు మంత్రి అనుచరుడిగా ఉన్న రాంబాబు రాజన్న ఆలయం నుంచి 60 కోడెలను తీసుకొచ్చినట్లు, ప్రస్తుతం అతడి వద్ద 11 కోడెలు మాత్రమే ఉన్నట్లు విచారణలో తేలడం చర్చనీయాంశమైంది. 60 కోడెల్లో 49 కోడెలను విక్రయించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే రాంబాబు అనే వ్యక్తికి కోడెలను ఇవ్వాల్సిందిగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రాజన్న ఆలయ ఈవోకు సిఫారసు చేసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజన్న ఆలయ గోశాలలోని కోడెల్లో ఒక్కో రైతుకు రెండు చొప్పున ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ ఏడాది మార్చి నుంచి రాష్ట్రంలోని పట్టదారు పుస్తకం కలిగిన రైతులకు రెండు కోడెల చొప్పున ఆలయాధికారులు అందజేస్తున్నారు. ఒక్కరికే 60 కోడెలు ఇవ్వడంపై తీవ్ర దుమారం రేపింది. గోశాల నుంచి గత రెండు నెలల వ్యవధిలో కోడెలను అప్పగించిన రైతుల వివరాలను ఆంధ్రజ్యోతి అడగడంతో సంబంధిత అధికారి సెలవులో ఉన్నట్లు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. మంత్రి అనుచరుడైన

మిగతా 6వ పేజీలో..

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన మోదేపల్లి శివకుమార్(25) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శివకుమార్ అదే గ్రామానికి చెందిన యువతిని నాలుగు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఏడాది వయస్సు గల కూతురు ఉంది. శివకుమార్ కొంతకాలం ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేశాడు. జీతం సరిపోవటం లేదని మూడు నెలల కిందట ఉద్యోగం మానేశాడు. ఇంటివద్దనే ఉంటూ ప్లంబర్ పనిచేస్తుండేవాడు. డబ్బులు లేక కుటుంబపోషణ భారమవు తోందని శివకుమార్ బాధపడుతుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం రాత్రి బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండ టంతో అక్కడి వెళ్లి తిరిగి రాత్రి శివకుమార్ ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. శనివా రం ఉదయం కుటుంబసభ్యులు చూసే సరికి శివకుమార్ ఉరికి వేళాడు తూ క నిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం


కనకయ్య(ఫైల్)

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందు తూ మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తమ్మనబోయిన కనకయ్య(63) తన గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి గొర్రెలను తరలిస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న ఆటో (టీఎస్36టీ5538) కనకయ్యను ఢీకొట్టింది. కనకయ్య కింద పడి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మానకొండూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గొండ పెద్దన్న(65) అనే సింగరేణి విశ్రాంత ఉద్యోగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా పెద్దన్నకు ఇంటిముందు ఉన్న ఖాళీ స్థలం విషయంలో పక్కింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపా నికి గురై గత నెల 21న నిద్రమాత్రలు వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. 17 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువతి మృతి

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఎల్కపల్లి శిరీష (22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన మైస శ్రీనాథ్ అనే వ్యక్తి శిరీషను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. దీంతో పాటు ఆమెను మానసికంగా వేధించడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం శిరీష మృతి చెందింది. శిరీష తల్లి ఎల్కపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆమె ఆత్మహత్యకు కారణమైన మైస శ్రీనాథ్, మైస సుశీల, మైస సారయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ఎల్లారెడ్డిపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన అదే గ్రామానికి చెందిన మహిళ లక్ష్మి నిలబడి ఉంది. బొప్పాపూర్ లోని వ్యక్తి బోండ్ల బాలకిషన్ తన ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మహిళను ఢీ కొట్టినాడు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తంగళ్లపల్లిలో చోరీ


పగుల గొట్టి ఉన్న బీరువా

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో కోడం విజయ ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ. 90 వేల నగదు ఎత్తుకెళ్లారు. వారంరోజుల క్రితం కోడం విజయ కుటుంబం ముంబాయి వెళ్లగా శనివారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రామ్మోహన్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మానాల ఆటవీ ప్రాంతం



ఉద్యమాల చిరునామా మానాల

- నాడు సాయుధ శిక్షణ కేంద్రంగా అడవులు
- నేడు కనుమరుగవుతున్న వృక్ష సంపద
- అటవీ భూములను ఆక్రమిస్తున్న అక్రమార్కులు
- రక్షించాలని కోరుతున్న ప్రజలు


మానాలలో అమర వీరుల స్తూపం

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల అడవులకు ఎంతో ఉద్యమ చరిత్ర ఉంది. మానాలలోని అడవులు, గుట్టల్లో సాయుధ దళాలకు శిక్షణ శిబిరాలను నిర్వహించేవారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మావోయిస్టు దళాల సభ్యుల వరకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఉద్యమాల్లో భాగస్వాములయ్యేవారు. ఆయా ప్రాంతాల్లో పోరాటాల్లో గాయపడిన సభ్యులకు ఈ ప్రాంతానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించేవారు. ఆ ఆనవాళ్లు ఇప్పుడు కనుమరగవుతున్నాయి. అక్రమార్కుల గొడ్డలి వేటుకు మానాల అడవుల్లోని వృక్ష సంపద, గుట్టలు అంతరించిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని మానాల గిరిజన ప్రాంతం. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి సిరిసిల్ల జిల్లా పరిధిలోకి మారింది. లోకం పోకడ ఎరుగని మారుమూల పల్లె మానాల, అక్కడి మనుషులకు ప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. కానీ మానాల అంటే చరిత్ర పుటల్లో మాసిపోని పోరాట వేదిక. అమాయకులైన ఇక్కడి ప్రజలు అనేక పోరాటాలను గుండెల్లో పెట్టుకున్నారు. మానాల ఆడవులు దట్టమైనవి కావడంతో తెలంగాణ సాయుధ పోరాటంలో గెరిల్లా దళాలకు ఇక్కడ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తెలంగాణ రైతాంగ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహిళా అమరవీరుల రెండో స్తూపం ఇక్కడ నిర్మించారు.

అడవుల్లోకి భూ అక్రమార్కులు

ఉద్యమ చరిత్ర ఉన్న మానాల అడవుల్లోకి భూ అక్రమార్కులు


నరికివేతకు గురైన వృక్షం

చొరబడ్డారు. చెట్లను అక్రమంగా నరుకుతూ భూములను చదును చేస్తున్నారు. చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకొని అటవీ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి మొదలుకొని మానాల వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న గాది గుట్ట తండా వరకు అటవీ ప్రాంతంలో సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు వృక్ష సంపదను నేల మట్టం చేశారు. సీమర్ల ఆటవి ప్రాంతంలోనూ భారీ వృక్షాలను నరికి వేశారు. మానాల గ్రామం శివారులో కొన్ని సంవత్సరాల క్రితం ఆటవీ ప్రాంతం అన్యాక్రాంతం కావడంతో ఆప్పటి అటవీ అధికారులు సుమారు 40 ఎకరాల్లో నీలగిరి మొక్కలతో ప్లాటేషన్ చేశారు. ఆయితే అవి వృక్షాలుగా మారాయి. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి నీలగిరి చెట్లను నరికి భూములను ఆక్రమించేందుకు కొందరు, కలపను అమ్ముకునేందుకు మరికొందరు చెట్లను నరికి వేస్తున్నారు. అంతే కాకుండా ఎంతో విలువైన టేకు కలప, వన మూలికల చెట్లను నరికి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి చేరుతున్నాయి. అంతరించి పోతున్న అడవులను కాపాడాలని రెండు జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని బియ్యాన్ని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్ కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ నుంచి వేములవాడ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంకెపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఒక వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా పెడుతూ విస్తృతస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్ గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్ రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డీటీసీఎస్ రవీంద్రచారి తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హుజూరాబాద్ నుంచి ఎనగల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుకు తరలిస్తున్న 70 క్వింటాళ్ల బియ్యం, రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిరిసిల్ల డీటీసీఎస్ నవీన్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరి రిమాండ్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7: నగరానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలిక కుటుంబసభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శాస్త్రీరోడ్‌కు చెందిన మహ్మద్ సిరాజొద్దీన్‌ను అరెస్టు చేశారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

సహజ వనరులను కొల్లగొడుతున్న మోదీ ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్(రంగారెడ్డి), పోటు ప్రసాద్(ఖమ్మం) సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ఆదానీ, అంబానీ, నీరవ్ మోదీ బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొట్టి విదేశాల్లో దాక్కున్నారన్నారు. నీరవ్ మోదీని అప్పగించాలంటూ బ్రిటన్ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సంవత్సరకాలం పూర్తి చేసుకుందని సంబరాలు చేసుకుంటున్నారని, ఏడాదిలో రాష్ట్రంలో ఏం చేశారని ఒక్కసారి నెమరు వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు మీసం లక్ష్మన్, కడారి రాములు, కేవీ అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు



హైకోర్టుకు జడ్జికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈఈవో, కోడెమొక్కు చెల్లించుకుంటున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరావు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అధికారులు రాజన్న ప్రసాదాన్ని అందించారు.

రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ లోకి వెళ్తుండగా కరీంనగర్ వైపు నుంచి రాజీవ్ రహదారిపై వేగంగా వచ్చిన ఓ వాహనం బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రా మంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ తోట తిరుపతి శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- పలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- తక్కువ పెట్టుబడి.. చీడపీడల బాధ లేదు
- టన్ను గెలలకు రూ. 20,413

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో ఏడు క్లస్టర్లలో 72 మంది రైతులు 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల సబ్సిడీలు అందుతుండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఒక్కసారి దిగుబడి ప్రారంభమైతే 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. కూలీలు, కోతులు, పశువుల సమస్య లేకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

సబ్సిడీలు.. ప్రోత్సాహకాలు

ఎకరం భూమిలో సుమారు 57 మొక్కలను నాటవచ్చు. వీటి సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం డ్రిప్ సిస్టంపై ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఐదు ఎకరాల్లోపు సాగు చేస్తున్న బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు ఎకరాలపై సాగు చేసిన రైతులకు 80 శాతం సబ్సిడీ కాగా 20 శాతం జీఎస్టీని సదరు రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్నకారు రైతుల తోటల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా మొక్కలకు గుంతలు తవ్వి ఎరువులను ఉచితంగా అందజేస్తారు. మొక్కలను సంరక్షించడానికి ఎకరాన రైతుకు ఏటా 4,200 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది.


వేగురుపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట




మానకొండూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎకరానికి రూ. 1.5 లక్షల ఆదాయం

ఆయిల్‌పామ్ 30 నుంచి 40 ఏళ్ల పంట కాగా 36 నెలలకు పంట కోతకు వస్తుంది. ఎకరాన 10 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు 20,413 రూపాయల ధర ఉండడంతో రెండు లక్షల విలువైన పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడులు, కూలీ ఖర్చులు ఎకరానికి 50 వేల రూపాయలు పోను రైతులకు సుమారు లక్షన్నర ఆదాయం వస్తుంది. పత్తి, మిర్చి, వరి ఇతర పంటల్లాగా ఆయిల్‌పామ్‌కు చీడపీడల బాధలేదు. ఎలాంటి వాతవరణ పరిస్థితులనైనా తట్టుకోవడం ఈ పంట ప్రత్యేకత. కోతులు ఇతర పశువులు ఈ గెలలను, చెట్లను ముట్టుకోవు. తక్కువ నీళ్లు ఉన్నప్పటికి డ్రిప్ సాయంతో సాగు చేయవచ్చు. దళారుల సమస్య లేకుండా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకవస్తే వారే కాంటా వేసి సరుకును తీసుకుంటారు. రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అవుతాయి. ఆయిల్‌పామ్‌కు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తుంది. ఆయిల్‌పామ్ చెట్ల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

ఏడెకరాల్లో సాగు

- నందికొండ ముత్తారెడ్డి, రైతు, వేగురుపల్లి



నాకు గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వరి, ఆరుతడి పంటలను సాగు చేసేవాడిని. ఈ పంటలను సాగు చేయడానికి పెట్టుబడితో పాటు కూలీల కొరత ఉండేది. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. ముందుగా ఐదున్నర ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మరో ఏడాదికి మిగతా ఎకరంన్నర భూమిలో మొక్కలను పెట్టాం. నీరు, కూలీల అవసరం తగ్గింది. పెట్టుబడి తగ్గింది. ఆయిల్ పామ్ మొక్కల మధ్య అంతర పంటలైన కూరగాయలు, బంతిపూలు సాగు చేశాము. మంచి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ చెట్లకు గెలలు వచ్చి కోత దశకు వచ్చాయి. మార్కెట్లో ధర బాగుందని సంబంధిత అధికారులు చెప్పారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

- రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ధర్నా

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు. వరంగల్ జిల్లా గీసుకొండలో కోడెలు పట్టుబడటంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విడివిడిగా రాజన్న ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయ ఈవో కార్యలయం ఎదుట బైఠాయించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో భక్తులు రాజన్నకు చెల్లించుకునే కోడెలను వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి అనుచరుడైన రాంబాబుకు అందజేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్, వంగల శ్రీకాంత్, నీలం శేఖర్, గోలి మహేష్, మారం కుమార్, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆలయ ఈవో కార్యలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాజన్న కోడెలు పక్కదారి పట్టాయని వస్తున్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సగ్గు రాహుల్, నామాల శేఖర్, పిన్నింటి హన్మాండ్లు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

- వేములవాడ రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్పందిస్తూ కోడెలు పక్కదారి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి

ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేశారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో చదవులు ముందుకు సాగడం లేదన్నారు. ముగ్గురిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపేందుకు మౌఖిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపే అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆందోళన చేశామన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్లారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు డీసీపీ రాజు

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ(అడ్మిన్) సీ రాజు శనివారం తనిఖీలు జరిపారు. సాయుధ దళ పోలీసు కవాతు తరువాత టర్న్ అవుట్ పరిశీలన జరిపారు. సెర్మినల్ డ్రిల్ సిబ్బంది పరేడ్ తనిఖీ చేశారు. ఏఆర్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఏఆర్ సిబ్బంది సివిల్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారని, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఆర్ఐ ఆఫీస్, రికార్డు రూమ్, బెల్లప్ ఆర్మ్స్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేషం, సంపత్, ఎస్ఐలు పాల్గొన్నారు.

‘శాతవాహన’లో ఉద్యోగాల పండుగ

- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన - 50 కంపెనీలు హాజరు
- 427 మందికి ఉద్యోగాలు



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

గణేశ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శాతవాహన యూనివర్సిటీలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాకు విశేష స్పందన లభించింది. 50 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ ఆధికారి చిరంజీవులు మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో ఇంతపెద్ద జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగం ఉరికే రాదని, కష్టపడి చదవాలని సూచించారు. ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మొట్టమొదటి సారిగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. రెండువేల పైచిలుకు విద్యార్థులు ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యూనివర్సిటీలో సంవత్సరంలో రెండుసార్లు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాలో 2,649 మంది పాల్గొనగా 427 మంది నియామక పత్రాలు అందుకున్నారన్నారు. 845 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు



● ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది

పావని, మంథని జేఎన్టీయూ

యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు.

● పలు అంశాలపై అవగాహన కల్పించారు..

జి సాయిరిషీంద్ర, కరీంనగర్



జాబ్ మేళాలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. మంచి కంపెనీలో ఉద్యోగం పొందాను. ఆనందంగా ఉంది.



● మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది..

వైష్ణవి, హైదరాబాద్

ఉద్యోగానికి వెళ్లినప్పుడు ఇంటర్వ్యూదే ముఖ్యపాత్ర. ఇంటర్వ్యూలో ఎలా మాట్లాడాలి.. రెస్యూమ్ ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మంచి కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

● ప్రముఖ కంపెనీలు.. ఒకే వేదికపై..

- డి తేజవర్ధన్



రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలు యూనివర్సిటీలో ఒకే వేదికపై జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ మేళా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇంటర్వ్యూలకు హైదరాబాద్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. ఇక్కడికే అన్ని ప్రముఖ కంపెనీలు రావడంతో ఆర్థిక భారం తగ్గింది.



● నా కల నెరవేరింది..

- టి అరుణ్, శాతవాహన యూనివర్సిటీ

నేను శాతవాహన యూనివర్సిటీలో పీజీ చేస్తున్నాను. ఇక్కడే ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. చదువు పూర్తికాగానే హైదరాబాద్ వెళ్లి జాబ్ చేద్దాం అనుకున్నా. ఈ మేళాలో ఉద్యోగం సాధించి నా కల నెరవేర్చుకున్నా..

ఆదివారం ప్రత్యేకం

కనుమరుగవుతున్న కచ్చురం

యంత్రాల రాకతో కనిపించని ఎడ్లబండ్లు

● శిథిలాలుగా మిగిలిపోయిన పరిస్థితి

ఒకప్పుడు పల్లెటూరుకు వెళ్తే ఎడ్ల బండ్లు కనిపించేవి. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతో గొప్పవాళ్లు అనేవాళ్లు. జోడెడ్ల బండి ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనులకు రవాణా సాధనంగా వినియోగించేవారు. అదే బండిపై ఇంటిల్లిపాదీ జాతర్లకు, శుభకార్యాలకు వెళ్లేవారు. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేనివాళ్లు వారి అవసరాలకు అడిగి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఏదో ఒక పల్లెటూరిలో ఒకటి రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అన్నదాతలకు బతుకునిచ్చిన కచ్చురం కాలక్రమేణా వైభవాన్ని కోల్పోయింది.



శిథిలంగా మిగిలిన ఎడ్ల బండి చక్రాలు



మర్రిగడ్డలో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ప్రదర్శన కోసం షెడ్డులో నిలిపిన ఎడ్ల బండి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్లు చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలాయి. సరైన రహదారి, రవాణాకు అంతగా వాహనాలు లేని రోజుల్లో కాడెద్దుల బండే రవాణా సాధనం. రైతులు పొద్దున్నే సద్దిగట్టుకొని ఎడ్లబండిపై పొలాలకు వెళ్లేవారు. ఎరువులు, విత్తనాలు, గ్రాసం, ఇలా దేన్నైనా ఎడ్లబండి మీదే తరలించేవాళ్లు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో ఎడ్ల బండ్లకు ఫుల్ డిమాండ్ ఉండేది. సీజన్ ఆరంభంలో పొలాలకు పెంట తరలించడం మొదటి పని, పొలం దున్నేందుకు అవసరమైన నాగళ్లు, గొర్రులను రైతులు ఎడ్లబండిపైనే తీసుకెళ్లేవారు. పండిన వడ్లు పట్టించేందుకు రైస్ మిల్లుకు వెళ్లే రవాణా సాధనమూ ఎడ్లబండే. ఇంట్లోకి కావాల్సిన వంట చెరుకు, పశువుల పాకలు, ఇల్లు కట్టేందుకు అవసరమైన కలప ఎడ్లబండ్ల పైనే తెచ్చేవారు. నాడు రవాణా సౌకర్యం అంతంతమాత్రం కాబట్టి ఇంటిల్లిపాదీ జాతరకు వెళ్లాలంటే ఎడ్లబండే బస్సు, కారు అన్నీ. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేని వారు అద్దెకు ఎడ్లబండి తీసుకెళ్లేవారు. కలపతోనే కమ్మరులు చక్రాలు, బాడీతోపాటు బండికి అవసరమయ్యే విడి భాగాల తయారు చేసేవారు. వడ్రంగులు, కమ్మరుల పని ప్రదేశాలు హడావుడిగా కనిపించేవి. ఎడ్ల బండి తయారీకి అప్పట్లో చాలా తక్కువ ఖర్చయ్యేది. తయారీకి ఇరుసు, ఖానీ, నొగళ్లు, గొలుసు, సాయినీలా, బడితెలు, కోలు అవసరమవుతాయి ఇప్పుడు అక్కడక్కడా ఇనుప చక్రాలతో తయారు చేసిన బండ్లు కనిపిస్తున్నాయి. ట్రాక్టర్ వచ్చి ఎడ్ల బండి మనుగడను తొక్కేసింది. క్రమక్రమంగా ‘కాడెడ్ల కచ్చరం’ కాలంలో కనుమరుగవుతోంది. ఎడ్ల బండి అంటే అప్పట్లో పిల్లల్లో క్రేజ్ ఉండేది. పెద్దలు ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్నప్పుడు పిల్లలు కూడా సరదాగా ఎడ్ల బండి ఎక్కేవారు. ఇప్పటి పిల్లలకు ఎడ్లబండి అంటే ఏమిటో తెలియని పరిస్థితి. ఎడ్లు, ఎడ్లబండితోనే పొలం పనులు మొదలయ్యేవి. ఆ రోజులు మళ్లీ రావు. కాలం మారుతున్న కొద్దీ ఎడ్లబండ్ల సంస్కృతీ పోతున్నది.



మూడపల్లిలో ఓ ఇంట్లో శిథిలమైన ఎడ్లబండి

ఎడ్లబండి ఇంటికి కళ తెచ్చేది

- ఇందూరి హరిబాబు, మర్రిగడ్డ



నాడు గ్రామాల్లో ఎడ్లబండ్లు ఎక్కువగా కనిపించేవి. ఎడ్లబండి ఉన్న ఇంటికి ప్రత్యేక ఆకర్షణ. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతోగొప్ప. ఇంటికి కళ తెచ్చేది. ఎడ్ల బండి ఉన్న ఇంట్లో రెండు ఎడ్లు ఉండేవి. ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండి మీదే వెళ్లేవాళ్లు, ఇప్పుడు అక్కడక్కడా ఒకటీ రెండు బండ్లు కనిపిస్తున్నాయి. అవి కూడా ఇనుముతో తయారు చేసినవి. కొన్ని టైరు బండ్లు. రాబోయే తరానికి ఎడ్ల బండి ఎలా ఉంటదనేది తెలియడం కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన పాతకాలంనాటి ఎండ్లబండిని ప్రదర్శన కోసం ఉంచాను.

ట్రేడ్ లైసెన్స్‌ల పేర సైబర్ నేరస్థుల ఫోన్ కాల్స్

- మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపారులను నమ్మించే యత్నం

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇన్నాళ్లు లాటరీలు, పార్సిళ్లు, బ్యాంకులు, ఉద్యోగాల పేరుతో మోసగించిన సైబర్ నేరస్థులు ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న వ్యాపారులకు సైతం ప్రభుత్వాధికారుల పేర ఫోన్ చేసి బెదిరిస్తూ దండుకుంటున్నారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నుంచి మాట్లాడుతున్నామంటూ శనివారం గోదావరిఖని పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసిన సైబర్ నేరస్థులు ట్రేడ్‌లైసెన్స్‌లు ఒకే దశ చెల్లించే అవకాశం వచ్చిందని, వెంటనే తాము చెప్పిన నంబర్‌కు ఫోన్ చేస్తే అప్‌డేట్ చేస్తామని, లేదంటే 45 రోజులు షాపు సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు గురిచేశారు.

శనివారం మాతంగి కాంప్లెక్స్‌లోని ఒక సూపర్ మార్కెట్ యజమానికి, కళ్యాణ్‌నగర్ లోని మరో ఏజెన్సీ నిర్వాహకుడిగా, లక్ష్మీనగర్‌లోని మరో నలుగురు వ్యాపారులకు ఇదే తరహా ఫోన్లు వచ్చాయి. షాపు పేరు, యజమాని పేరు చెబుతూ ఒకే దఫా 9990 రూపాయలు చెల్లిస్తే భవిష్యత్‌లో ట్రేడ్ లైసెన్స్ చెల్లించే అవసరం ఉండదని, నగరంలో చాలా మంది వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారంటూ నమ్మించే యత్నం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే తరహా పలువురు వ్యాపారుల నుంచి సైబర్‌నేరస్థులు డబ్బులు దండుకున్నారు. కాగా బీహార్, గుర్గావ్ తదితర ప్రాంతాల నుంచి సైబర్ నేరస్థులు తెలుగులో మాట్లాడుతూ ఈ తరహా మోసాలకు పాల్పడినట్టు తెలిసింది.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు విష్ణువర్ధన్, వినయ్, గైని నక్షత్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.



క్రీడాకారులతో అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



గణిత ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని శ్రీహిత

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీహిత మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు, చతుర్భుజంలోని నాలుగు కోణాలు 360 డిగ్రీలని కార్డులతో ప్రయోగపూర్వకంగా చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం మోటూరి రవీందర్ తెలిపారు. గైడ్ టీచర్‌గా గణిత ఉపాధ్యాయుడు యాగండ్ల గంగాధర్ వ్యవహరించారు. విద్యార్థిని శ్రీహితను తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారు రాంప్రసాద్, డీసీఈబి కార్యదర్శి మురళీమనోహరాచారి, పరీక్షల కమీషనర్ రాజమౌళి, ఎంఈవో లోకిని శ్రీనివాస్ అభినందించారు.

రోడ్డుపై రూ. మూడు లక్షలు

పోలీసులకు అప్పగించిన వ్యాపారస్తులు



సీఐకి డబ్బు అప్పగిస్తున్న మారుతి, కిరణ్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో రోడ్డుపై పడి ఉన్న మూడు లక్షల నగదును కొందరు వ్యాపారులు గమనించి వెంటనే వాటిని పోలీసులకు అప్పజెప్పారు. పట్టణంలోని పాత బస్టాండ్ చావిడికి వెళ్లే మార్గంలో మారుతి మసాల దుకాణం ముందు 500 రూపాయల నోట్ల కట్టలు (3 లక్షల రూపాయలు) పడి ఉండడాన్ని షాపు యజమానులు సామా మారుతి, కంభంపాటి కిరణ్‌కుమార్ గమనించారు. వెంటనే వాటిని మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరివైన డబ్బులు పోగొట్టుకుంటే సరైన అధారాలు సమర్పించి డబ్బులు తీసుకెళ్లాలని కోరారు. మానవత్వంతో డబ్బులు అప్పగించిన మారుతి, కిరణ్‌ను సీఐ అభినందించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన తెలుకంటి శ్యామల(55) శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామలకు పదేళ్ల నుంచి మానసిక స్థితి బాగలేదు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అయ్యప్ప స్వాములు



మల్లన్న జాతరలో నృత్యాలు చేస్తున్న శివసత్తులు



మల్లన్న బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతిమాత శనైశ్చర సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులకు గుండేటి నాగరాజు - రాధ దంపతులు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, దేవాలయ కమీటి సభ్యులు తోట రాజు, కాసు కాంగ్రి జుంబర్తి రమేష్, గట్టు ఆనంద్, నిమిషకవి నాగరాజు, మరిపల్లి రవీగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల రూరల్: షష్టి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అయిపూర్ గ్రామంలో మల్లన్న జాతర మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. యాదవ సాంప్రదాయ ప్రకారం ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై మల్లన్న దేవుడికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని గ్రామం నుంచి మల్లన్న ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాల శోభాయాత్రలో శివసత్తులు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాలను మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ పిడుగు రాధ- సందయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పెద్దమ్మ తల్లి బోనాలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలో పెద్దమ్మ తల్లి బోనాలు తీశారు. సిరిసిల్ల పట్టణ పాతబస్టాండ్ నుంచి పెద్దమ్మ దేవాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించుకొని మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. సిరిసిల్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కీసరి నాగరాజు, ప్రధాన కార్యదర్శులు నూనె శ్రీనివాస్,జెట్టి కొమరయ్య, పండగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలోకి కొండచిలువ

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని మొలంగూరి రమేష్ ఇంటి ఆవరణలోకి శనివారం కొండ చిలువ రావడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామస్థులు కొండచిలువను కొట్టిచంపారు.

గొర్రెలు మృత్యువాత

ముస్తాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకోడ్‌లో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు శనివారం మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన బొమ్మెన దేవయ్య గొర్రెలను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్తున్న క్రమంలో రెండు గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.

హిందూ ఐక్య వేదిక ర్యాలీ

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పార్టీలకు అతీతంగా పలు రాజకీయ నేతలు పాల్గొన్నారు.

ఎల్లో కలర్ డే

వీర్నపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఎల్లో కలర్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పసుపు రంగు దుస్తులను ధరించారు. పసుపు రంగు పండ్లు, ఆట బొమ్మలను తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల విద్యార్థిని వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ ఉమెన్ పోటీలలో వైష్ణవి ఉత్తమ ప్రదర్శన కనబర్చింది.

మరోసారి రాజన్న కోడెల వివాదం



వేములవాడ రాజన్న ఆలయ గోశాలలోని కోడెలు

(3వ పేజీ తరువాయి)

రాంబాబు ఒక్కడే పలువురు రైతుల పాసు బుక్‌లు తీసుకొచ్చి 60 కోడెలు తీసుకెళ్లినట్లు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అసలు గోశాల నుంచి కోడెలు ఎవరు తీసుకువెళ్లారు? రైతుల వద్దనే కోడెలు ఉన్నాయా? అసలు రాజన్న కోడెలను తీసుకెళ్లే సమయంలో గోశాల నిర్వాహకులు కోడెల చెవులకు ట్యాగ్‌లు వేశారా? అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని, పర్యవేక్షణ కమిటీతో రైతులు తీసుకున్న కోడెలపై విచారణ చేస్తే నిజా నిజాలు బయటపడతాయని రాజన్న భక్తులు, వేములవాడ పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు.

రాజన్న కోడెల తరలింపు తప్పుడు అభియోగం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించుకునే నిజ కోడెలను సొసైటీలకు తరలించామని వచ్చిన వార్తలు తప్పుడు అభియోగమని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయ కోడెల వివాదంపై శనివారం 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన స్పందించారు. రాజన్న ఆలయ గోశాలలోని కోడెలను నిబంధలను అనుగుణంగా రైతులకు మాత్రమే అప్పగిస్తున్నామన్నారు. రాజన్న కోడెలను రైతులకు అందించేందుకు కలెక్టర్, జిల్లా పశువైద్యాధికారి, వ్యవసాయాధికారితోపాటుగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రైతులు తమ పట్టదారు పుస్తకంతో వ్యవసాయాధికారి ధ్రువీకరించిన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటేనే విచారణ చేసి కోడెలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబరుతోపాటు గత పది రోజుల క్రితం, వరంగల్, సిద్దిపేట, ఇతర జిల్లాలకు చెందిన రైతులకు కోడెలను పంపిణీ చేశామన్నారు. శ్రీరాజేశ్వర సొసైటీ పేరుతో తమకు ఎలాంటి సిఫారసు లేఖలు రాలేదని, సొసైటీలకు కోడెలను పంపిణీ చేయలేదని అన్నారు. రైతులకు పంపిణీ చేసే కోడెల చెవులకు రాజన్న ఆలయ ట్యాగ్ ఉంటుందని, వాటిని తొలగించడానికి వీలు కాదని, వాటిని తొలగించాలంటే కోడె చెవిని కోయాల్సి వస్తుందని వివరించారు. రైతులకు అందించిన కోడెలపై పర్యవేక్షణ కమిటీతో విచారణ చేపడతామని, కోడెలు లేని వారిపై నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గీసుకొండలో దొరికిన కోడెలు రాజన్న కోడెలని విచారణలో తెలితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కోడెల తరిలింపు అనేది తప్పుడు అభియోగమని, గీసుకొండ పోలీసుల నుంచి వచ్చిన నోటీసుకు వివరణ ఇస్తామని అన్నారు. తప్పుడు వార్తలపై విచారణ కోసం వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలోని కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజంలేదని కొంత మంది కావాలని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాజన్న ఆలయ కోడెల పక్కదారిపైన మంత్రి స్పందిస్తూ శనివారం ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గత ప్రభుత్వం హయాంలో రాజన్నకు భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ భారంగా మారి చాలా కోడెలు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం కలెక్టర్ చైర్మన్‌గా, ఆలయ ఈవో కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక రైతుకు రెండు కోడెల చొప్పున మాత్రమే ఇస్తున్న విషయాన్ని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోడెల సంరక్షణ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సాధరణంగా తన వద్దకు వచ్చే దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు సూచిస్తుంటామని, కోడెల పంపిణీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులను అదే విధంగా పంపించామని మంత్రి తెలిపారు.

వ్యాస రచన పోటీల్లో ద్వితీయస్థానం

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని హారిక ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు బోయిని తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ ఆవశ్యకత, చేనేత కార్మికుల పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఇంట్లో పిల్లలకు చదువుకునే వాతావరణం కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావడం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో రూ.కోటి 56 లక్షలతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సుమారు 240 నూతన అంబులెన్స్‌లను మంజూరు చేసిందన్నారు. రుద్రంగి, కోనరావుపేట మండల కేంద్రాలకు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించిందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఎల్‌వోసీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సుమారు 10 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే 30 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను మోసం చేసిందని, ప్రజా ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి వసంత రావు, తహసీల్దార్ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్,మార్కెట్ కమిటి చైర్మన్ చెల్కల తిరుపతి, వైస్ చైర్మన్ బోజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ పాల్గొన్నారు.

కోనరావుపేట: రైతుల శ్రేయస్సు కోసం కష్టపడి పని చేస్తూ ముందుకు సాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్‌గా తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్‌లు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన సంబరాలు నిర్వహించుకునే రోజు ప్రమాణ స్వీకారం చేయడం శుభ పరిణామం అని అన్నారు. నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, చేపూరి గంగాధర్, గడ్డం నర్సయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా పాల్గొన్నారు.

యాసంగికి సన్నద్ధం

(3వ పేజీ తరువాయి)

వేములవాడ 976, సిరిసిల్ల 942, కోనరావుపేట 885, వీర్నపల్లి 1132, ఎల్లారెడ్డిపేట 993, గంభీరావుపేట 867, ముస్తాబాద్ 1006, తంగళ్లపల్లి 995, ఇల్లంతకుంటలో 944 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 26.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టులో 3.50 టీఎంసీలకు 2.60 టీఎంసీల వరకు నిల్వ ఉంది. బోరు బావుల్లోనూ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో యాసంగికి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

వానాకాలం ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీని ద్వారా 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల శాఖ కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 247 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించారు. ఇప్పటికే 151 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేసి మూసి వేశారు. పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు 1,95,799 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఐకేపీ ద్వారా 39,900 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 1,49,516 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 3642 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 2840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 28,438 మంది రైతుల ఖాతాల్లో 1,75,505 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.407.16 కోట్లు జమ చేశారు.

నేతన్నల అభ్యున్నతికి చర్యలు

(3వ పేజీ తరువాయి)



నూలును పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సంలో భాగంగా యారన్ డిపోను ప్రారంభించకోవడం శుభపరిణామం అన్నారు. యారన్ డిపోలో 12 మంది సిబ్బందిని నియమించామన్నారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో యారన్ డిపో అందుబాటులోకి వస్తుందన్నారు. నేతన్నల 30 సంవత్సరాల కోరిక నూలు డిపోతో తీరిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, మంత్రుల సహకారంతో నూలు డిపో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే చూసి ఓర్వలేక కలెక్టర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నిరుపేదలకు చెందాల్సిన భూములు వారికే ఉపయోగపడేలా చేస్తామని అన్నారు. జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌రావు, ఏడి సాగర్, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణచ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

గ్రామానికో గ్రంథాలయం



సత్యనారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో గ్రంథాలయం ఏర్పాటుతోపాటు ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. ఇటీవల గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్న ఆయనను ఆ పార్టీ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలానికి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 9న వీర్నపల్లి మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాజయ్య, రాంరెడ్డి, రాజునాయక్, బాబు, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన



అయ్యప్పస్వాములతో నగర సంకీర్తన

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నుంచి శబరిమలకు మహాపాదయాత్ర చేపట్టి దిగ్విజయంగా ముగించుకొని సిరిసిల్లకు చేరుకున్న అయ్యప్ప స్వాములతో కలిసి పలువురు స్వాములు శనివారం నగర సంకీర్తన చేపట్టారు. పట్టణంలోని హరిహరిపుత్ర అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకుడు రాచ విద్యాసాగర్ గురుస్వామి నేతృత్వంలో ప్రయాకర్‌రావు మధుసూదన్ గురుస్వామి ఆధ్వర్యంలో 20 మంది అయ్యప్ప దీక్షాదారులు శబరిమలై పాదయాత్ర చేపట్టి శుక్రవారం రాత్రి సిరిసిల్లకు చేరుకున్నారు. శనివారం సిరిసిల్ల అయ్యప్ప స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తన చేశారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న పర్షహన్మండ్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీల న్యాయబద్ధమైన ప్రధాన సమస్యలను పరిష్కారానికి సిఫారసు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మాండ్లు, నాయకులు శనివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బీ వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్షహన్మాండ్లు మాట్లాడుతూ స్థానిక సంస్థలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. విద్యా, ఉద్యోగాలలో 27 శాతం నుంచి 42 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యఓడుడు తడుక కమలాకర్, నాయకులు కందుకూరి రామాగౌడ్, బచ్చు ప్రసాద్, సామల తిరుపతి, కొండ విజయ్, చిందం శ్రీధర్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకులపై మరింత బాధ్యత

ముస్తాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ నాయకులపై బాధ్యత మరింత పెరిగిందని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొప్ప దామోదర్, తాళ్ల విజయ్‌రెడ్డి, మండల అధ్యక్షులుగా రంజాని నరేశ్ అత్యధిక మెజారిటీతో గెలవడం సంతోషకరమన్నారు. పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, చిట్నేని అంజనేయరావు, ఉచ్చిడి బాల్‌రెడ్డి మిరుదొడ్డి భాను పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ జాబితా ప్రదర్శన

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై రెండో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ జాబితాను శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నోటీసు బోర్డుపై ఆయా గ్రామాల పోలింగ్ స్టేషన్ల గ్రాఫ్ట్ లిస్టును ప్రదర్శించినట్లు తెలిపారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జాబితా ప్రదర్శించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఉన్నారు.

సీఎం కప్ గ్రామ స్థాయి పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్వరూపరెడ్డి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడలు శనివారం నిర్వహించారు. విజేతలను మండలస్థాయికి ఎంపిక చేశారు.

ఇల్లంతకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో సీఎం కప్ ఆటల పోటీలు శనివారం ప్రారంభంఅయ్యాయి. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని మేకల పావణి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తంగళ్లపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీఎం కప్ క్రీడా పోటీలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి శనివారం ప్రారంభించారు.

స్వయం ఉపాధి కల్పనకు చర్యలు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, మహిళలు, ట్రాన్స్ జెండర్లకు స్వయం ఉపాధిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్ వద్ద ఇండియన్ అయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ 4.5 కోట్లతో దివ్యాంగులు, మహిళలు, ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఈ బంక్ దేశంతోపాటు రాష్ట్రంలోనే మొట్టమొదటిదనానరు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమర్ ఝా, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షఅభియాన్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేయాలని, మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాంనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల సమ్మెకు టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. సమ్మె విజయవంతానికి టీపీటీఎఫ్ మండల బాధ్యులు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండాడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెలమ సామాజిక వర్గంపై అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెలమ సంక్షేమ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జునేని వేణగోపాల్‌రావు అన్నారు. శనివారం జిల్లా వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే శంకర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరినీ సమానం చూసుకుంటానని గవర్నర్ ఎదుట ప్రమాణం చేసిన ఎమ్మెల్యే వాటిని తుంగలో తొక్కి అభ్యంతకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వెలమ సంక్షేమ మండలి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాపారావు, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని చందుర్తి మండల వెలమ సంఘం నాయకులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘం నాయకులు పోన్నాల శ్రీనివాసరావు, జలగం కిషన్‌రావు, రమేష్ రావు, ఆశోక్‌రావు, లక్ష్మన్‌రావు, కమలాకర్ రావు, రామరావు, ముకుందరావు, శేఖర్‌రావు, ఆనందరావు, వేణుగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ అన్నారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను విమర్శించడం సరి కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణకు మద్దతు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- అదిలాబాద్ - నిజామాబాద్- మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థి బీసీ బిడ్డ ప్రసన్న హరికృష్ణకు తమ మద్దతని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరు సమావేశంలో మాట్లాడారు. బీసీ అభ్యర్థిప్రసన్న హరికృష్ణ మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించుకోవాన్నారు.

దేశానికి తెలంగాణ పోలీస్ రోల్ మోడల్



వేడుకలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశానికి తెలంగాణ పోలీస్ రోల్ మోడల్ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు-2024 సందర్భంగా నిర్వహించిన పోలీస్ డే వేడుకలను చొప్పదండి, మానకొండూరు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడడంలో జిల్లా పోలీస్‌యంత్రాంగం ముందంజలో ఉందన్నారు. సీఎం ఆధ్వర్యంలో నేరాలు అరికట్టడంలో పైచేయి సాధిస్తోందన్నారు. ఎక్కడ శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా పోలీస్‌శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెంపొందించడం కోసం స్టాల్స్ ఏర్పాటు శుభపరిణామం అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పోలీస్ డే నిర్వహించామన్నారు. సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆర్ఐలు మధుకర్, రమేశ్, ఎస్సైలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోలీస్‌డేలో ప్రదర్శించిన జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు ఏకే 47రైఫిల్‌తో గురిపెట్టడం నవ్వులు కురిపించింది. వివిధ విభాగాల పోలీస్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి



గంభీరావుపేటలో బైఠాయించిన ఆటో కార్మికులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా ఆటో(ప్యాసింజర్)డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోల బంద్ విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో ఆటోలను బంద్ చేసి స్థానిక నేతన్నచౌక్ వద్ద ఆటో డ్రైవర్లు, జేఏసీ నాయకులు ధర్నా చేపట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ నాయకులు ఆటో డ్రైవర్ల ఆటో బంద్‌కు మద్దతును తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ అధ్యక్షుడు అల్లె శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంతో ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12వేల ఆర్థిక సహాయం, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. సంవత్సర కాలం గడుస్తున్న హామీలను అమలు చేయలేదన్నారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సిరిసిల్ల ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో ఆటో కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేపట్టారు. అంతకుముందు ర్యాలీగా వెళ్లారు. పెద్దమ్మ స్టేజీ వద్ద వంటావార్పు చేపట్టారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇబాదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఆటో డ్రైవర్లు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి గ్రామాల్లో శనివారం ఆందోళనకు దిగారు.

కోనరావుపేట: ఆటో కార్మికులు ఇచ్చిన బందు పిలుపు మేరకు కోనరావుపేట మండలంలో శనివారం విజయవంతమైంది. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయప్రకాశరావుకు వినతి పత్రం అందజేశారు.

ఇల్లంతకుంట: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం పిలుపు మేరకు శనివారం ఆటోడ్రైవర్లు బంద్ పాటించి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఓలా, రాపిడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.